క్లుప్తంగా

ఇసుక లారీ సీజ్

మద్దిపాడు: అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని మద్దిపాడు ఎస్‌ఐ శివరామయ్య సీజ్ చేశారు. ముండ్లమూరు మండలం పోలవరం గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను ఒంగోలు వైపు తరలిస్తున్న లారీని తనిఖీ చేయగా డ్రైవర్ వద్ద ఎటువంటి అనుమతులు లేకపోవడంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని సీజ్ చేసి మద్దిపాడు స్టేషన్‌కు తరలించారు.

వరద బాధితులను ఆదుకోవాలి

ఒంగోలు సెంట్రల్: వరదలలో సర్వం కోల్పోయి రోడ్డుపాలైన ప్రజలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపు నిచ్చారు. సర్వం కోల్పోయి చేతులు చాస్తున్న వారిని ఆదుకోవటం తమ బాధ్యత అని.. ప్రతి ఒక్క పౌరుడు దానిని నిర్వర్తించాలని కోరారు. సీపీఐ కార్యకర్తలకు సహకారం అందించాలని కోరారు. కాగా శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో అధిక ధరలపై చేపట్టిన నిరసన కార్యక్రమాలు వాయిదా వేస్తున్నట్లు ఎంఎల్ నారాయణ తెలిపారు. కార్యకర్తలు వరద బాధితులకు సాయం అందించే కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

ఓటర్ల జాబితాపై ఇంటింటి సర్వే

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితా సవరణలో భాగంగా జిల్లాలో ఈ నెల 20వ తేదీ వరకు ఇంటింటి సర్వే జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 20వ తేదీ ప్రారంభమైన ప్రక్రియ ఇప్పటి వరకు 40 శాతం పూర్తయిందని తెలిపారు. ఓటర్ల జాబితాలోల పేరు లేని అర్హులు ఎవరైనా ఉంటే స్థానిక బీఎల్‌ఓ దృష్టికి తీసుకెళ్లి జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. మార్పులు, చేర్పులకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని తెలిపారు. సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1950ను సంప్రదించవచ్చన్నారు.

రక్తదానంతో సంపూర్ణ ఆరోగ్యం

ఒంగోలు మెట్రో: రక్తదానం ఆరోగ్యాన్ని ఆయుష్షుని పెంచుతుంది వాసవి క్లబ్ అంతర్జాతీయ సేవా సంస్థ కోశాధికారి శిద్దా వెంకట సూర్య ప్రకాష్ రావు తెలిపారు. వాసవి క్లబ్స్ అంతర్జాతీయ సేవా సంస్థ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల చంద్రసేన గుప్త 105వ జయంతి సందర్భంగా వాసవి వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో వాసవి క్లబ్ ఒంగోలు, వాసవి క్లబ్ కేసీజీ ఒంగోలు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.వాసవి జిల్లా 205 రక్తదాన శిబిరాల ఇన్‌చార్జ్ జి. బ్రహ్మానందంతో పాటు 62 మంది రక్తదానం చేశారు. వాసవిక్లబ్ ఒంగోలు అధ్యక్షుడు నల్ల మల్లి బదరి నారాయణ, కూనల శ్రీనివాస రావు, దర్శి మనోహర్ చంద్రశేఖర్, టంగుటూరి రంగస్వామి, పబ్బిశెట్టి వినోద్ కుమార్, పబ్బిశెట్టి గోవర్ధన్, నూకల శ్రీనివాస రావు, భూమా శ్రీనివాసరావు, పాత్తూరి శ్రీదేవి, మద్దు అరవిందలక్ష్మి, చలువాది సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలోత్సవం విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఎంఆర్ సంస్థల అధినేత బొమ్మిశెట్టి తదితరులు

ఒంగోలు సెంట్రల్: ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు 61వ సందర్భంగా ఈనెల 8న భవిత కోసం బాలోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళావేదిక కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు తెలిపారు. భవిత కోసం బాలోత్సవం పోస్టర్‌ను గురువారం బీఎంఆర్ సంస్థల అధినేత బొమ్మిశెట్టి శంకర రావు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రజా సమస్యలపై విద్యార్థుల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తున్న ప్రజా కళావేదికను అభినందించారు. వెంకటేశ్వర్లు, నాగరాజు, కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



కొత్తపట్నం హైస్కూల్‌లో రాధాకృష్ణన్‌కు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



సాయిబాబా సెంట్రల్ స్కూల్లో నృత్యరూపకం

ఒంగోలు: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్ మూర్తిని జిల్లాలోని బీఈడీ కాలేజీల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యం కలిసి సత్కరించారు. జీవీ సుబ్రహ్మణ్యం, షేక్ చాంద్‌భాషా, చంద్రశేఖర్, లక్ష్మీ నారాయణ తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్ఎన్ కాలేజీలో..
స్థానిక ఎస్ఎస్ఎన్ డిగ్రీ, జూనియర్ కాలేజీలో గురువారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పతనాన్ని, ఆయన ఉపాధ్యాయులకు ఎందుకు మార్గదర్శకులు అనే దానిపై విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ పొదిలి కార్తీక్, సత్యన్నారాయణ, కోఆర్డినేటర్ ఇల్లూరి మధు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా సెంట్రల్ స్కూల్లో..
స్థానిక సాయిబాబా సెంట్రల్ స్కూల్లో గురువారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సాయినాధుని శృతి మాట్లాడుతూ విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో గురువుల కృషి వెలకట్టలేనిదన్నారు. విద్యార్థుల పట్టుదలకు, సాధించాలనే తపనకు గురువు మార్గదర్శకం తోడైతే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నా, ఒక తరాన్ని ముందుకు నడిపించాలన్నా అది గురువులకే సాధ్యపడుతుందన్నారు. 9,10 తరగతుల విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో పాఠశాలకు విచ్చేసి సందడి చేశారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో..
స్థానిక కేబీ రెస్టారెంట్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ సభ్యులు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని ప్రముఖ కెమిస్ట్రీ ఉపాధ్యాయులు సిద్దయ్య, గణిత ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఫిజిక్స్ ఉపాధ్యాయులు వినోద్, కేవీఆర్ సంస్థల అధినేత శ్రీనివాస్‌లను క్లబ్ సభ్యులు ఈ సందర్భంగా సత్కరించారు. పాల్గొన్న వక్తలు ఉపాధ్యాయ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరపాటి రమేష్, పాస్ట్ జోన్ చైర్మన్ పల్లపు సుబ్బయ్య, రీజనల్ చైర్మన్ చిట్టింరెడ్డి శ్రీనివాసరెడ్డి, జోన్ చైర్మన్ నైనాల రామకృష్ణ, క్లబ్ అధ్యక్షులు ఈదర వెంకటేష్, కార్యదర్శి గ్రంథి పార్థసారధి, కోశాధికారి లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో..
స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. అన్ని రంగాలలో విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ యొక్క గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించి మహనీయుల జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని జీవితంలో రాణించాలన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు కొవ్వొత్తిలా కరుగుతూ విద్యార్థులకు వెలుగు అనే జ్ఞానాన్ని ప్రసాదింపజేస్తారన్నారు. కాలేజీ చైర్మన్ డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రీదేవి, డీన్స్, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ గురుభక్తిని చాటుతూ ప్రదర్శించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పూర్వజన్మ సుకృతమే
విశ్వవిద్యాలయాల్లో చదువులు పూర్వజన్మ సుకృతమే అని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ డీవీఆర్ మూర్తి అన్నారు. గురువారం స్థానిక విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన మన దేశ రెండో రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతికి గుర్తుగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించుకుంటున్న విషయాన్ని వివరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం నేటి యువతకు ఎంతో ఆదర్శమని పేర్కొన్నారు. భారీ కేక్‌ను కట్ చేసి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజమోహన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలామణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతమ్‌దేవ్ కుమార్, సీడీసీ డీన్ డాక్టర్ జి.సోమశేఖర, సీఈ డాక్టర్ కేవీఎన్ రాజు తదితరులు పాల్గొని వీసీని ఘనంగా సత్కరించారు.

గురుపూజోత్సవం నాడు చిన్నారుల దాతృత్వం
కొత్తపట్నం: గురు పూజోత్సవం నాడు చిన్నారులు దాతృత్వం చాటారు తమ గురువు సత్కారం కోసం కేటాయించిన నగదును విజయ వాడ వరద బాధితులకు అందించారు. పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న సీహెచ్ కోటేశ్వరరావును 8, 9వ తరగతి విద్యార్థులు సన్మానించాలని నిర్ణయించుకున్నారు. అయితే ఆయన మాట్లాడుతూ ఈ ఖర్చు విజయవాడ వరదలో చిక్కుకుపోయిన వారికి సహాయం చేయాలని కోరారు. దీంతో 8,9 తరగతులకు చెందిన విద్యార్థులు రూ. 1,116 విరాళంగా ఇచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు చిన్నారులను అభినందించారు. చెక్ రూపంలో సీఎం రిలీఫ్‌కు పంపించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కాగా మండలంలో అన్ని పాఠశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కొత్తపట్నం బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం. శ్రీదేవి అధ్యక్షతన వైభవంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటాకి పూల మాల వేసి నివాళులర్పించారు.



సత్కారం అందుకుంటున్న ఏకేయూ వీసీ డీవీఆర్ మూర్తి



వీసీని సత్కరిస్తున్న బీఈడీ కాలేజీల ప్రిన్సిపాళ్లు



ఎస్ఎస్ఎన్ కాలేజీలో గురుపూజోత్సవం

ఉత్తమ ఉపాధ్యాయినిగా మజ్నూబీబీ



షేక్ మజ్నూబీబీ

మద్దిపాడు: మండలంలోని బసవన్న పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయినిగా పని చేస్తున్న డాక్టర్ షేక్ మజ్నూబీబీ రెండు విభాగాల్లో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు. దీంతో ఆమెను రోటరీ క్లబ్ ఒంగోలు సెంట్రల్ కమిటీ సభ్యులు గురుపూజోత్సవం సందర్భంగా గురువారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిస్తున్న కెరియర్ గైడెన్స్, ఆస్ట్రేలియా మెల్‌బోర్న్ యూనివర్సిటీ నిర్వహిస్తున్న కెరియర్ ఎడ్యుకేషన్‌కు ఆమె ఎంపికలు చేస్తున్నారు. దీని ఆధారంగా ఒంగోలు రోటరీ క్లబ్‌వారు గురు పూజోత్సవం సందర్భంగా ప్రజంటేషన్ ఆఫ్ నేషనల్ బిల్డర్ అవార్డులను ఇచ్చే క్రమంలో స్థానిక గౌతమ్ మోడల్ స్కూల్‌లో గురువారం సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సామూహిక సీమంతాలు

ఒంగోలు మెట్రో: శ్రీ పరంజ్యోతి మానవ సేవ సమితి, ఒంగోలు వారిచే గర్భిణులకు సామూహిక సీమంత వేడుకలు స్థానిక మాతా శిశు వైద్యశాల గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద గురువారం నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ తల్లీబిడ్డలు ఆయురారోగ్యాలతో జీవించాలని తెలిపారు. పసుపు, కుంకుమ, రవిక, పండ్లు అందజేశారు. సౌజన్య, శేష కుమారి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పేస్‌లో ఇంటర్నల్ హాకథాన్- 2024

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఇంటర్నల్ హాకథాన్ 2024 కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ముందుగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీటెక్, ఎంటెక్, ఎంబీఏ విద్యార్థులు ఇంటర్నల్ హాకథాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక్కో టీంలో ఆరుగురు చొప్పున 30 టీంలు ఏర్పాటు చేసి 180 మంది విద్యార్థులు తమ నూతన ఆలోచనలకు పదునుపెట్టారు. మెరుగైన ప్రదర్శన చేసిన టీంలను ఎస్ఐహెచ్ 2024కి పంపిస్తామని కమిటీ తెలిపింది. కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్‌లు, వివిధ విభాగాల అధిపతులు విద్యార్థులను ప్రోత్సహించారు.

వరద బాధితులకు బూచేపల్లి ట్రస్ట్ చేయూత



వరద బాధితుల కోసం బూచేపల్లి ట్రస్టు ఆధ్వర్యంలో తరలుతున్న వాటర్ బాటిల్స్, పులిహోర బాక్సులు

- 10 వేల వాటర్ బాటిల్స్, పులిహోర బాక్సులు అందజేత

చీమకుర్తి: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి తక్షణమే స్పందించారు. బూచేపల్లి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం 10 వేల వాటర్ బాటిళ్లను తెప్పించారు. బూచేపల్లి కల్యాణ మండపంలో బుధవారం రాత్రి పులిహోర తయారు చేయించి ప్రత్యేకంగా బాక్సులను తెప్పించి పార్శిల్ చేయించారు. గురువారం వాహనాల్లో పులిహోర, వాటర్ బాటిళ్లను తరలించారు. విజయవాడలో స్థానిక పోలీసుల సాయంతో బూచేపల్లి ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు కలిసి వరద బాధితులకు వాటిని అందించారు.



బూచేపల్లి కల్యాణ మండపంలో తయారు చేస్తున్న పులిహోర

క్రీడాకారిణికి చేయూత

ఒంగోలు సెంట్రల్: సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ గురువారం క్రీడాకారిణి రామ తులసికి రూ. 50 వేల ఆర్థిక సహాయం అందించారు. ఒంగోలు ప్రగతి నగర్ కాలనీలో నివసిస్తున్న ఆర్. రామ తులసి అథ్లెటిక్స్, వాలీబాల్‌లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించింది. సెప్టెంబర్‌లో మలేషియాలో ఇంటర్నేషనల్ ఓపెన్ అథ్లెటిక్స్‌లో పాల్గొనేందుకు అవకాశం వచ్చింది. ఆమెకు ఆర్థిక పరిస్థితి దీనికి సహకరించని విషయం మీడియా ద్వారా సూర్యశ్రీ ట్రస్ట్ తెలుసుకుంది. దీంతో మండువ మురళీకృష్ణ సహకారంతో రూ. 50వేల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ బాష, దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్‌లు గురువారం అందించారు. రామతులసి మలేషియాలో జరిగే పోటీల్లో చక్కగా రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. నత్తుల శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారిణికి చెక్కును అందిస్తున్న ట్రస్ట్ బాధ్యులు

40 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



మాట్లాడుతున్న ఆర్ఎం గున్నేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: విద్యారంగంలో సేవలందించిన 40 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎస్‌బీఐ అధికారులు ప్రత్యేకంగా సన్మానించారు. స్థానిక కర్నూల్ రోడ్డులోని ఎస్‌బీఐ ఆర్ఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎస్.గున్నేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. రేపటి తరానికి మార్గనిర్దేశం చేసే మార్గదర్శకులు ఉపాధ్యాయులన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎస్‌బీఐ ద్వారా అందిస్తున్న పలు పథకాల గురించి ఆర్ఎం ఉపాధ్యాయులకు వివరించారు. డీఈఓ సుభద్ర మాట్లాడుతూ ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం మంచి పరిణామమన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులతో పాటు డీఈఓ సుభద్ర, డిప్యూటీ డీఈఓ ఎస్.సుబ్బారావులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్లు వేదం రాజేష్ బాబు, ఎన్‌వివి.నాగేశ్వరరావు, కె.హారతి, కె.రామారావు, హెచ్ఆర్ మేనేజర్ నళినీ కాంత్, లక్ష్మీ నారాయణ, కే.జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కొండంత అండ



కొత్తపట్నం: విజయవాడలో భోజన ప్యాకెట్లు, తాగు నీరు పంపిణీ చేస్తున్న మథర్ థెరెస్సా టీం సభ్యులు

ఒంగోలు: విజయ వాడ వరద బాధితులకు సాయం చేసే చేతులు ముందుకు వస్తున్నాయి. స్థానిక సింగరాయకొండ పెరల్ డిస్టిలరీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ తరఫున ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి రూ. 1.50 కోట్లు విరాళం ముఖ్యమంత్రి సహాయనిధికి అందించారు. విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో సీఎంకు అందించారు. కార్యక్రమంలో మాగుంట సుబ్బరామ రెడ్డి అల్లుడు ఆనం శివ కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

లక్ష విరాళం
ఒంగోలు: బెంగళూరు నివాసి, స్థానిక వ్యాపార వేత్త ఇడమకంటి లక్ష్మీరెడ్డి దంపతులు లక్ష రూపాయలు అందించనున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో ఈ మొత్తాన్ని సీఎం సహాయ నిధికి అందించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రేతరులు కూడా స్పందించి రాష్ట్రంలో వర్షబాధితులను ఆదుకునేందుకు తమవంతుగా సాయం అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

కొత్తపట్నం: అల్లూరు గ్రామానికి చెందిన మదర్ థెరిస్సా హెల్పింగ్ సభ్యులు భోజన ప్యాకెట్లు, తాగు నీరు గురువారం పంపిణీ చేశారు. జిల్లాలో అనేక మంది పేద వారిని గుర్తించి సేవాకార్యక్రమాలు చేస్తూ ఆదుకుంటూ ఉంటారు. అందులో భాగంగా మదర్ థెరిస్సా కమిటీ సభ్యులు ఐకానిక్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత మిట్నసల అశోక్ బాబు ఆయన ఇచ్చిన నగదుతో విజయవాడలో అంబేడ్కర్ ఇండియా మిషన్ బృందం వారితో కలిసి భోజనాలు, టిఫెన్లు, తాగు నీరు పంపిణీ చేశారు. హెల్పింగ్ టీమ్ సభ్యులు ఆర్గనైజేషన్ డి.కేశవ, సభ్యులు ఉన్నారు.

వరద బాధితులకు దివ్యాంగుల వితరణ
ఒంగోలు అర్బన్: వరద బాధితులకు తమవంతు సహాయాన్ని అందించారు దివ్యాంగులు. గిద్దలూరు నియోజకవర్గం బేస్తవారిపేటకు చెందిన దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు పోలూరి వెంకటస్వామి రూ.19వేలను గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ప్రకాశం భవనంలో అందజేశారు. వరదల్లో చిక్కుకున్న వారికి చేదోడుగా నిలబడేందుకు తనతో పాటు ప్రతి నెలా వస్తున్న పెన్షన్‌లో పొదుపు చేసుకున్నా పలువురు దివ్యాంగులు సహకారం అందించారని తెలిపాడు. తోట నరసింహులు రూ.4 వేలు, గుండుబొమ్మ రఘుదాసుబాబు రూ.3 వేలు, సోము విజయ కుమారి రూ.2 వేలు, దూదేకుల సిద్దయ్య రూ.1వెయ్యి అందచేసినట్లు తెలిపాడు. దివ్యాంగుల శాఖ ఏడీ అర్చన తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ వరద బాధితుల సహాయార్థం రూ.55,300 చెక్కును కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందించారు. సంఘ అధ్యక్షుడు ఎర్రయ్య, ఇతర సభ్యులు శ్రీనివాసులు, నాగయ్య, వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

వరద బాధితులకు చేయూత
ఒంగోలు సెంట్రల్: వరద బాధితుల సహాయార్థం జిల్లాలోని ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున రూ. 2లక్షలు అందించినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు దేసు వీరయ్య తెలిపారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా వ్యవసాయాధికారి ఎస్. శ్రీనివాసరావుకు 5వేల ఆహార ప్యాకెట్స్ సరఫరాకు ఈ మొత్తం ఉపయోగిస్తారని చెప్పారు.



కలెక్టర్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి



చెక్కుతో ఇడమకంటి లక్ష్మీరెడ్డి దంపతులు